

రాంనగర్ రామాలయంలో జరిగిన ఉగాది పంచాంగ శ్రావణం కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ ఆనంద్ ముదిరాజ్, ధర్మకర్తలు గోవర్ధన్ రెడ్డి, రాంచందర్ యాదగిరి, మీనా పూజారులు వెంకటరమణ చార్యులు, వేణుగోపాల్, తదితరులు -రాంనగర్, ఆంధ్రజ్యోతి



ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూసగోరక్‌నాథ్, తదితరులు



బీజేపీ కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో కావ్యా కిషన్‌రెడ్డి, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, బీజేవైఎం నాయకుడు కుషాల్ గౌడ్



భవాని శంకర ఆలయంలో పంచాంగ శ్రావణం చేస్తున్న వేద పండితులు మురళీ శర్మ తదితరులు



తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ శ్రవణం చేస్తున్న దృశ్యం

రాజ్యాంగాన్ని పల్లెపల్లెన ప్రచారం చేయాలి

- భూపతి వెంకటేశ్వర్లు

రాంనగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పది కాలాల పాటు పదిలంగా వర్ధిల్లాలంటే పల్లెపల్లెన కళాకారులతో రాజ్యాంగాన్ని ప్రచారం చేయాలని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని పీటీఎస్‌కే హాల్‌లో ఉగాది పండగను పురస్కరించుకొని భారత రాజ్యాంగ శ్రవణం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అంటే శాస్త్రీయ విజ్ఞానం ప్రామణిక గ్రంథం, నేటికి రాజ్యాంగమే దేశానికి రహదారి అని కొనియాడారు. జ్యోతిష్యానికి శాస్త్రీయ ప్రమాణాలు లేవు ముందు జరగబోయేది ఎవ్వరూ చెప్పలేరు, పంచాంగాలు ప్రపంచ గతిని మార్చలేవు. విజ్ఞానం పరిశోధన ఆచరణే మార్గదర్శకాలని భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమం నరేష్ అధ్యక్షతన జరిగింది. భావి భారత పౌరుడి చేతిలో భారత రాజ్యాంగాన్ని పట్టించి భారత రాజ్యాంగంపై ప్రయాణం చేశారు. కార్యక్రమంలో టీపీఎస్‌కే నాయకులు నాగేశ్వర్‌రావు, మహేష్, దుర్గేడప్పు స్వామి, రాజయ్యగౌడ్, యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్స్, బ్రాహ్మణి, వెంకట్ కోన తదితరులు పాల్గొన్నారు.



కుద్బిగూడలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బద్దుల శిరీష

వేసవిలో దాహాన్ని తీర్చడానికి చలివేంద్రాలు

బర్కత్‌పుర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిరుపేదల దాహాన్ని తీర్చడానికి చలి వేంద్రాలు ఎంతో దోహదపడతాయని బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ బద్దుల శిరీష ఓం ప్రకాష్ యాదవ్, హిందూ శ్మశాన వాటిక ప్రబంధ కమిటీ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ అన్నారు. ఆదివారం ఉగాది సందర్భంగా కాచిగూడ డివిజన్ కుదిబిగూడలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సునీల్ బిడ్లాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి బస్తీలో వేసవిలో చలి వేంద్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. బాటసారులకు నిరుపేదలకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని వారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ బద్దుల ఓం ప్రకాష్ యాదవ్. ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, బబ్లు, సతీష్, మహేష్, రమేష్, శ్రీకాంత్, రాకేష్ పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

బర్కత్‌పుర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఎంఎంటీఎస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ప్రభాకర్ కుమారుడు బి. భానుచందర్(34) అబిడ్స్‌లోని జువెలరీ షాపులో ఉద్యోగం చేస్తున్నాడు. మద్యానికి బానిసైన భానుచందర్ అప్పులు చేశాడు. అవి తీర్చలేక జీవితంపై విరక్తి చెందిన భానుచందర్ శనివారం అర్ధరాత్రి శివరాంపల్లి- బుద్వేల్ రైల్వేస్టేషన్ల నడుమ ఎంఎంటీఎస్ రైల్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

ఘనంగా ఉగాది వేడుకలు

ముషీరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయాల్లో వేద పండితులచే పంచాగ శ్రావణ కార్యక్రమాలు, పచ్చడి పంపిణీ నిర్వహించారు. భోలక్‌పూర్ దేవుని తోటలోని 400ల సంవత్సరాల చరిత్ర గల భవాని శంకర ఆలయంలో పంచాంగ శ్రావణం నిర్వహించారు. గాంధీనగర్‌లోని సంగమేశ్వర దేవాలయంలో జరిగిన పంచాగ శ్రావణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను పార్టీ సీనియర్ నాయకులు పూసగోరక్‌నాథ్, వెంకటేశ్వర్‌రావు తదితరులు ఎమ్మెల్యేను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో ముషీరాబాద్‌కు చెందిన బీజేవైఎం నాయకులు కుషాల్‌గౌడ్, ఆయూష్, సురేష్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్‌లను సన్మానించారు.



మైసమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు

గోల్నాక డివిజన్

గోల్నాక, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ దుర్గానగర్‌లోని శ్రీదుర్గా మైసమ్మ దేవాలయంలో ఉగాది పండగను పురస్కరించుకుని విశ్వావసునామ సంవత్సర పంచాంగ శ్రవణం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసచారి విశ్వావసునామ సంవత్సరం విశిష్టతను, ప్రాధాన్యతను వివరించి చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె. దుర్గాప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎనుగంటి నరేందర్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి శంకర్, బస్తీ పెద్దలు అంజయ్య, సత్యనారాయణ, అంజయ్య, రాములు, కృష్ణ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



శివం మందిరంలో పంచాంగ శ్రవణం చేస్తున్న టీటీడీ వెంకటేశ్వర వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్యం అవధాని -రాంనగర్, ఆంధ్రజ్యోతి



అంబర్‌పేటలో తాతాభట్ల కిరణ్‌కుమార్ శర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. -రాంనగర్, ఆంధ్రజ్యోతి



ఉగాది సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో పంచాంగ శ్రవణం జరిగింది. గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, బీజేపీ నేతలు వినయ్‌కుమార్, ఉమేశ్, శ్రీకాంత్, బీఆర్ఎస్ నేతలు రాజ్‌మోహన్, బీఎన్ శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. -చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి



పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ కార్యదర్శి లక్‌పతి యాదగిరి గౌడ్, బాగ్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు గడ్డం శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కైలాష్ పతిగౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ మామిడాల రాజ్‌కిరణ్ తదితరులు -రాంనగర్, ఆంధ్రజ్యోతి

ఆధ్యాత్మికమార్గం కలియుగంలో రక్షణనిస్తుంది

చిక్కడపల్లి,మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కలియుగంలో ఆధ్యాత్మిక మార్గం రక్షణనిస్తుందని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతి స్వామి అన్నారు. వంశీ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగాన సభలో ఉగాది సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యాశంకరభారతీ స్వామి పాల్గొని టీటీడీ ఆస్థాన వేదపండితులు భట్టర్ సుందర ప్రహ్లాదాచార్యులకు వంశీ వేద ఉగాది పురస్కారం బహూకరించారు. విశ్వావసు నామ సంవత్సరం అందరికి శ్రేయస్సును అందిస్తుందన్నారు. రాజ్యశ్రీ రచించిన లలితా సహస్రనామ వ్యాఖ్యానం, డా. మీనాక్షి రచించిన సాయితత్వమేవ శరణం మమ గ్రంథాన్ని స్వామివారు ఆవిష్కరించారు. నిర్వాహకులు వంశీ రామరాజు, దర్శకుడు రేలంగి నరసింహారావు, చంద్రశేఖర్, వ్యాసకృష్ణరాధ, తెన్నేటి సుధ, సుంకరపల్లి శైలజ, సుధామయి పాల్గొన్నారు. రామరాజు తరంగిణి శాస్త్రీయ గానగోష్టి, సంతోష్‌కుమార్‌శాస్త్రి పంచాంగ శ్రవణం కార్యక్రమాలు జరిగాయి.



సుందర ప్రహ్లాదాచారికి పురస్కారం బహూకరిస్తున్న స్వామివారు

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక

- ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

ముషీరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని గుల్షన్‌నగర్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎంపీ అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేసిందని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు జఫీర్‌ఉద్దీన్, నాయకులు అల్లాఉద్దీన్, గుర్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు.



గుల్షాన్‌నగర్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న ఆలయ ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

చిక్కడపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం పునర్‌నిర్మాణం తరువాత ద్వితీయ వార్షికోత్సవాలు ఆదివారం ఆలయ ఈవో మాచర్ల దేవనాథం పర్యవేక్షణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 14వ తేదీ వరకు వార్షికోత్సవాలు జరుగుతాయి. ఆదివారం ఆలయ ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మచే పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

స్వామివారి వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం

ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయం ప్రాంగణంలోని కోదండరామ చంద్రస్వామి మందిరంలో స్వామివారి వసంత నవరాత్రోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.



వేంకటేశ్వరాలయంలో పోటెత్తిన భక్తులు

భక్తులతో కిటకిటలాడిన వేంకటేశ్వర ఆలయం

చిక్కడపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం ఆరుగంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాంగ శ్రవణాన్ని ఆలయ ఉప ప్రధాన అర్చకులు నారాయణచారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో అన్నపూర్ణ మాట్లాడుతూ ఆలయం ఎదుటనున్న కల్యాణ మండపంలో ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.

వేతన, సామాజిక భద్రతను అమలు చేయాలి

- బీఎంఎస్ డిమాండ్

చిక్కడపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేతన , సామాజిక భద్రతను వెంటనే అమలు చేయాలని బీఎంఎస్ తెలంగాణ రాష్ట్ర శాఖ కార్యదర్శి కేవీ రాధాకృష్ణన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బీఎంఎస్ నగర కార్యాలయం శ్రమశక్తి భవన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. వేతన సంహిత తక్షణమే అమలు జరిగితే అన్ని వర్గాల కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం, సకాలంలో జీతం, దోపిడీ నుంచి రక్షణ లభిస్తుందన్నారు. పించన్ ప్రావిడెంట్ ఫండ్, ఆరోగ్య బీమా, ప్రసూతి లబ్ధి ఇతర సామాజిక రక్షణ పథకాలు అందుబాటులోకి రావాలన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థలో జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టేందుకు కఠినమైన నియంత్రణలు తీసుకురావాలని, ముఖ్యంగా అసంఘటితరంగంలో దీన్ని తప్పకుండా అమలు చేయాలన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం సులభంగా న్యాయం పొందేలా కేంద్రం చూడాలన్నారు. ఈ అంశాల డిమాండ్లపై ఇటీవల తాల్చేర్‌లో అఖిల భారతీయ కాంట్రాక్ట్ కార్మిక మహాసంఘ్, భారతీయ మజ్దూర్ సంఘ్‌ల ఆధ్వర్యంలో అఖిల భారత స్థాయి మహాసభలు కూడా జరిగాయన్నారు.

పేదలకు సాయం చేయాలి

చిక్కడపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పేదలకు సహాయం చేసే కార్యక్రమాలు విస్తృతం చేయాలని యూటీఐ కార్మిక శాఖ కమిషనరేట్ బ్రాంచ్ మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్ కమిషనరేట్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రొద్దుటూరి నరసింహారావు, వెంకటేశం ఫ్యామిలీ సౌజన్యంతో నిర్వహించారు. అన్నదానాన్ని ప్రారంభించిన విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అన్నదానంలో పోటీ పరీక్షల అభ్యర్థులు సైతం పాల్గొని భోజనం చేయడం విశేషమన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పి.రమేష్, కోశాధికారి టి. రవీందర్, ఉపాధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, ప్రసాద్‌రావు, శ్రీనివాస్, బిక్షపతి, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్‌ను తలపిస్తున్న బంగ్లాదేశ్ మార్కెట్



భోలక్‌పూర్‌లో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న బంగ్లాదేశ్ మార్కెట్





వివిధ రాష్ట్రాలకు చెందిన టోపీలను కొనుగోలు చేస్తున్న యువకులు, షీర్ కుర్మా, సేమియా కొనుగోలు చేస్తున్న ముస్లింలు

- టోపీలు, వస్త్రాలు, షీర్‌కుర్మా సామగ్రి ఒకే చోట లభ్యం
- తెల్లవారుజాము వరకు మార్కెట్ కిటకిట

ముషీరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో నెల రోజులు ఉపవాసం ఉండి పండగను ఘనంగా జరుపుకునేందుకు కావల్సిన సామగ్రి, దుస్తుల కొనుగోలు చేసేందుకు స్థానికులతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు భోలక్‌పూర్‌లోని బంగ్లాదేశ్ మార్కెట్‌కు అధిక సంఖ్యలో తరలిరావడంతో మార్కెట్ కొనుగోలు దారులతో కిటకిటలాడింది. చార్మినార్ అంటేనే వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున గతంలో తరలివెళ్లేవారు. కానీ భోలక్‌పూర్‌లోని బంగ్లాదేశ్ మార్కెట్‌లో అన్నిరకాల వస్తువులు ఒకే చోట, తక్కువ ధరకే లభిస్తుండడంతో ప్రజలు బంగ్లాదేశ్ మార్కెట్ వైపు మొగ్గు చూపుతున్నారు. విద్యుత్ కాంతుల వెలుగుల మధ్య పండుగ సామగ్రి, దుస్తులు, టోపీలు, అత్తరు, డ్రై ఫ్రూట్స్, షీర్‌కుర్మా సామగ్రిని పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ముస్లింలు ఉంటారు. ముస్లింలు బంగ్లాదేశ్ మార్కెట్‌లోనే కొనుగోలు చేస్తుండడంతో ఈ మార్కెట్ చార్మినార్‌ను తలపిస్తోంది.

ముస్తాబైన బడీ మసీదు

నియోజకవర్గంలో పెద్దదైన భోలక్‌పూర్ బడీ మసీదును రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఒకేసారి దాదాపు 10 వేల మంది వరకు సామూహిక ప్రార్థనలు చేయనున్నారు. రంజాన్ పండుగ రోజు ఉదయం 9 గంటలకు పార్థనలకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని మసీదు ముత్తవల్లి నజీర్ అలీ తెలిపారు.



రంజాన్ పండుగకు విద్యుత్ దీపాలతో ముస్తాబైన భోలక్‌పూర్ బడీ మసీదు

అన్నీ ఒకే చోట లభ్యం



రంజాన్ పండగకు కావాల్సిన దుస్తులు, పిండి వంటలు, షీర్‌కుర్మా తయారు చేసే సామగ్రి తదితర వస్తువులు భోలక్‌పూర్ బంగ్లాదేశ్ మార్కెట్‌లో లభిస్తున్నాయి. తక్కువ ధరకే లభించడంతో పాటు సమయం కూడా కలిసి వస్తుంది. పేద మధ్యతరగతి ప్రజలకు ఈ మార్కెట్ అనుకూలంగా ఉంది.

\- ఆబేద్, ముషీరాబాద్ నివాసి